# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-12-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అంతిమ యాత్ర ఈరోజు ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి ప్రారంభమవుతుంది.**
2. **ప్రజా సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు.**
3. **తెలంగాణలోని టీటీడీ కల్యాణ మండపాల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ కోరారు.**
4. **విజయవాడలో ఈరోజు నుంచి 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు ప్రారంభమవుతాయి.**
5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 117వ సంచిక రేపు ప్రసారమవుతుంది.**

==========================

మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అంతిమ యాత్ర ఈ రోజు ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి ప్రారంభమవుతుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి వేణుగోపాల్ తెలిపారు. పార్టీ ప్రధాన కార్యాలయంలో ఈరోజు ప్రజల సందర్శనార్థం ఉంచుతారని, అనంతరం అంతిమ యాత్ర ఉదయం 9 గంటల 30 నిమిషాలకు మొదలవుతుందని చెప్పారు. ప్రజలు, పార్టీ కార్యకర్తలు ఆయనకు నివాళులర్పించవచ్చని పేర్కొన్నారు.

మరోవైపు కేంద్ర మంత్రి వర్గం నిన్న ఢిల్లీలో సమావేశమై మన్మోహన్ సింగ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసింది. దేశం ఒక ప్రముఖ రాజనీతిజ్ఞున్ని, ప్రఖ్యాత ఆర్థిక వేత్తను, ఒక గొప్ప నేతను కోల్పోయిందని సంతాప తీర్మానంలో పేర్కొన్నారు. 1991 నుంచి 1996 మధ్య కాలంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ దేశానికి ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు చేపట్టిన ఆర్థిక సంస్కరణలలో ఆయన పాత్ర మరువలేనిదని తీర్మానంలో వెల్లడించింది.

--------------------------

ప్రజా సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు నియోజకవర్గంలోని గ్రామాలలో పలు అభివృద్ధి పనులను మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ ద్వారా తాగునీరు, కచ్చా రహదారులు, మురుగు నీటి వ్యవస్థ నిర్మాణ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేస్తామని

తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే అనేక సంక్షేమ పథకాలు చేపట్టిందని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

మాతృభాష గొప్పతనాన్ని చాటి చెప్పేలా 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలను నిర్వహిస్తున్నామని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ వెల్లడించారు. విజయవాడలోని కేబీఎన్ కళాశాలలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈ రోజు, రేపు రెండు రోజులపాటు ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా యువతకు తెలుగు భాష, సాహిత్యాన్ని దరిచేర్చే లక్ష్యంతో సభలు జరుగుతాయన్నారు. దేశవిదేశాల నుంచి 15 వందల మందికి పైగా రచయితలు, కవులు హాజరవుతున్నారని తెలిపారు. తెలుగు భాషకు పూర్వ వైభవం తేవడమే మహాసభల లక్ష్యమని పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలోని టీటీడీ కల్యాణ మండపాల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు తీసుకుకోవాలని పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. నంద్యాల జిల్లాలోని శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవార్లను మంత్రి నిన్న దర్శించుకున్నారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడారు. తెలంగాణ నుంచి భక్తులు అధిక సంఖ్యలో తిరుమలకు వస్తుంటారని, ఆదాయం సమకూరుతోంది కాబట్టి కల్యాణ మండపాల అభివృద్ధికి టీటీడీ నిధులు అందించేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకరించాలని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..16 సెకన్లు

---------------------------

నూతన సంవత్సర శుభాకాంక్షలు పేరుతో సైబర్ నేరస్తులు మోసాలకు పాల్పడుతున్నారని తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ టీజీఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిన్న ఆయన మాట్లాడుతూ, శుభాకాంక్షలను ఫొటోలు, మెసేజ్‌ల పేరుతో తయారు చేసుకోవచ్చని, ఇందుకోసం ఈ కింది లింకుపై క్లిక్ చేసి వివరాలు నమోదు చేయాలని ఫోన్లకు సందేశాలు పంపిస్తున్నారని, వాటి ద్వారా ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఇటువంటి సందేశాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సజ్జనార్ సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో విద్యుత్ ఛార్జీలు పెరిగాయని శాసనమండలి సభ్యులు ఇషాక్ బాషా అన్నారు. కరెంట్ బిల్లులు తగ్గించాలని కోరుతూ నంద్యాలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిన్న నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల అభిప్రాయాలు సేకరించకుండా, స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని అన్నారు. విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని ఆయన పేర్కొంటూ,

వాయిస్ ...10 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 117వ సంచిక రేపు ప్రసారమవుతుంది.. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

--------------------------

తిరుమలలో 'డయల్ యువర్ ఈవో' కార్యక్రమం ఈరోజు ఉదయం 9 గంటల నుండి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరగనుందని టీటీడీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలను, సూచనలను తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వాహణాధికారికి ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలుపవచ్చని. పేర్కొంది. ఇందుకు కోసం 0877-2263261 నెంబర్ ను సంప్రదించాలని తెలిపింది.

--------------------------

వారం వారం ప్రపంచవ్యాప్తంగా జరిగిన వార్తల విశేషాలు, వివిధ అంశాల సమాచారంతో అంతర్జాతీయ విషయాలన్నింటిని తెలుగులో అందించేందుకు ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన వసుధైక కుటుంబం ప్రత్యేక కార్యక్రమం ఈరోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

--------------------------

సంక్రాంతి పండగ రద్దీ దృష్ట్యా హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే వారి కోసం 2 వేల 400 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ - ఏపీఎస్ఆర్టీసీ తెలిపింది. జనవరి 9 నుంచి 13వ తేదీ వరకు ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. సాధారణ బస్సులకు ఇవి అదనమని, ప్రత్యేక బస్సుల్లో అదనపు ఛార్జీలు ఉండవని, సాధారణ ఛార్జీలే ఉంటాయని స్పష్టం చేసింది. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్‌లో రద్దీని తగ్గించేందుకు జనవరి 10 నుంచి 12వ తేదీ వరకు కొన్ని మార్పులు చేసినట్లు తెలిపింది. కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, ఒంగోలు, మాచర్ల వైపు వెళ్లే ప్రత్యేక బస్సుల్ని ఎంజీబీఎస్‌కు ఎదురుగా ఉన్న పాత సీబీఎస్ గౌలిగూడ నుంచి నడపనున్నట్లు వివరించింది.

--------------------------

ప్రముఖ ధ్వని అనుకరణ కళాకారులు, డాక్టర్ నేరెళ్ళ వేణుమాధవ్ జయంతి ఈరోజు. నేరెళ్ళ గౌరవార్థం ఆయన పుట్టినరోజు డిసెంబర్ 28ని ప్రపంచ మిమిక్రీ దినోత్సవంగా జరుపుకుంటున్నారు. ఎంతోమంది ప్రముఖుల గళాలను అనుకరించిన నేరెళ్ళ వేణుమాధవ్... తెలంగాణాలోని వరంగల్లో 1932 డిసెంబర్ 28న జన్మించారు. అనేక మందిని మిమిక్రీ కళాకారులుగా తీర్చిదిద్ది, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులుగా సేవలందించారు. ఆయన మిమిక్రీ కళతో పాటు బొమ్మలు మాట్లాడుతున్నట్టు భ్రమింపజేసే వెంట్రిలాక్విజంతోనూ ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చుకున్నారు. కళా ప్రపూర్ణతో సహా పలు పురస్కారాలను, భారత ప్రభుత్వ పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న నేరెళ్ళ వేణుమాధవ్ 2018 జూన్ 19వ తేదీన తుది శ్వాస విడిచారు.

--------------------------

దేశాన్ని క్షయ వ్యాధి రహితంగా మార్చేందుకు 100 రోజుల క్షయ నిర్మూలన ప్రచార కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ నెల 7 నుంచి మార్చి 16వ తేదీ వరకు నిర్వహించే ఈ వంద రోజుల ప్రచారంలో అనేక కార్యక్రమాలను చేపడుతోంది. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం కింద దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 347 జిల్లాల్లో ఈ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.

======================